క్లుప్తంగా

రోడ్డు విస్తరించాలని వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని ప్రధాన సెంటర్‌లో ఇరువైపులా 50 అడుగులు రోడ్డును విస్తరించాలని గ్రామానికి చెందిన కొంతమంది శుక్రవారం కొత్తగూడెంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి విన్నవించారు. సెంట్రల్ లైటింగ్ తోపాటు డివైడర్ల నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. అయితే 50 అడుగులు విస్తరించాల్సిన రోడ్డును 33 అడుగులకే కుదించినట్లు వారు కలక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమంది వ్యాపారులు, రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం భవిష్యత్ అవసరాలను పణంగా పెట్టారని ఆరోపించారు. సత్వర చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కలక్టర్‌ను కలిసిన వారిలో గ్రామస్తులు ముత్యాల గోవిందరావు, చీపు నవీన్, భూపతిరావు, సతీష్, చెన్నారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం



నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

దుమ్ముగూడెం: మండలంలోని డి.కొత్తగూడెం గ్రామంలో అగ్నిప్రమాదానికి గురై ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన కారం చెంచయ్యకు రెడ్ క్రాస్ సొసైటీ క్లబ్ ఆధ్వర్యంలో అందజేసిన నిత్యావసరాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం పంపిణీ చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు పూర్తిగా కాలిపోయి, అభాగ్యులగా మారిన తరుణంలో భద్రాచలం రెడ్ క్రాస్ సొసైటీ క్లబ్ వారి సహకారంతో బాధితుడికి నిత్యావసరాలు, కొంత నగదును అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయాన్ని త్వరగా వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సోడి తిరుపతిరావు, నాయకులు వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

20న మహాధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: ఈ నెల 20వ తేదీన భద్రాచలంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మణుగూరు పట్టణంలో మహాధర్నా కరపత్రాలను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నెంబర్ 3ని చట్టంగా మార్చు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, 1976లో అక్రమ వలస లంబాడీలను ఎస్టీ హోదా నుండి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 1/70, పెసా, ఎల్‌టీఆర్, ఆర్ఓఎఫ్ఆర్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆయా డిమాండ్లపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం ఐటీడీఏల వద్ద ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు వాగబోయిన శ్రీను, మణుగూరు డివిజన్ అధ్యక్షుడు ఈసం సూర్యబాబు, ప్రధాన కార్యదర్శి తుర్రం రవికుమార్, ఉపాధ్యక్షుడు సోలం రమణ, మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్, ప్రధాన కార్యదర్శులు ఎం.రమేష్, కె.కోటి, ఎస్.కుమారస్వామి, ఎం.శ్రీను, వి.శివ, కె.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కరకగూడెం: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన కరకగూడెం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె గ్రామానికి చెందిన పున్నమయ్య అనే వ్యక్తి తాటిగూడెం నుంచి తన నివాసం వైపు నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టి అక్కడ నుంచి వాహనం ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో అతడి ఎడమ చేయి, ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అర్హుల గుర్తింపునకే సర్వే

- ఐదు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- 21 నుంచి 25 వరకు గ్రామ సభల నిర్వహణ



బి.కొత్తగూడెం గ్రామంలో ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని అర్హులైన రైతులకు రైతుభరోసా అందించేందుకు మండల అధికారులు క్షేత్రస్థాయిలో సన్నాహక చర్యలు ప్రారంభించారు. ఈ నెల 26న రాష్ట్రంలోని అర్హులైన రైతులకు రైతుభరోసా అందించడానికి ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. గురువారం నుంచి ప్రారంభమైన సర్వే ఈ నెల 20 వరకు జరుగనుంది. సర్వే అనంతరం సాగుకు యోగ్యం కాని భూముల లిస్టును గ్రామ పంచాయతీల్లో డిస్‌ప్లే చేస్తారు. 21 నుంచి 25 వరకు గ్రామ సభలు నిర్వహించి ఆమోదం తీసుకుంటారు. జనవరి 26న రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. గతంలో అనర్హులకి రైతుబంధు నగదు పడటంతో ప్రత్యేకంగా ప్రభుత్వం సాగు చేసే భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించడంతో అధికారులు ఫీల్డ్ సర్వేలను చేపట్టారు.

ప్రత్యేక బృందాలు..

ఈ నెల 26న సాగుకు అనుకూల భూములకు మాత్రమే పెట్టుబడి సహాయం ఎకరానికి రూ.12 వేలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో దీనిపై అధికారులు సర్వేకు సిద్ధమయ్యారు. మండలంలోని 37 పంచాయతీల పరిదిలోని సుమారు 100కు పైగా ఉన్న గ్రామాలలో ఫీల్డ్ సర్వే నిర్వహించేందుకు 5టీమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ ఐదు ప్రత్యేక బృందాలు గ్రామాల్లో సర్వే చేసి, అర్హుల జాబితా తయారు చేస్తాయి. ఈ టీమ్‌లో వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్, అటవి శాఖ అధికారులు సర్వేలో పాల్గొననున్నారు. భూభారతి పోర్టల్ సర్వే నంబర్ల ఆధారంగా సాగు భూములను గుర్తించనున్నారు.జనవరి 26న రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ చేయనున్నారు.

రైతు భరోసా..

ఇక రైతు భరోసా కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సన్నాహక చర్యలు ప్రారంభించారు. ఈనెల 20 వరకు సర్వే జరుగనుండగా.. సర్వే అనంతరం సాగుకుయోగ్యం కాని భూముల లిస్టును గ్రామ పంచాయతీల్లో డిస్‌ప్లే చేస్తారు. 21 నుంచి 25 వరకు గ్రామ సభలు నిర్వహించి ఆమోదం తీసుకుంటారు. జనవరి 26న రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ చేయనున్నారు

గ్రామ సభల్లో వివరాల వెల్లడి..

మండలంలో 37 పంచాయతీలలో ఫీల్డ్ విజిట్ చేస్తున్న టీంలు సర్వే అంతా పూర్తయిన తర్వాత ఈ నెల 21 నుండి 25 వరకు రైతు భరోసా పెట్టుబడి సహాయం అందించే రైతులు, భూముల వివరాలను గ్రామసభల్లో అధికారులు వెల్లడించనున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో రైతుభరోసా అర్హులు,అనర్హుల జాబితాను వెల్లడించేందుకు ప్రణాళికలు తయారుచేయనున్నారు.

సర్వే చేస్తున్నాం..



మండలంలో సాగుకు యోగ్యం కాని భూముల వివరాల కోసం గురువారం నుంచి ఈ నెల 20 వరకు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించనున్నాం. మండలంలోని ఆయా గ్రామాల్లోని పట్టాదారుల పాస్ పుస్తకాలను పరిశీలించి సాగు భూములను గుర్తిస్తాం. సర్వే అనంతరం నిర్దేశిత తేదీల్లో గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుంది.

– నవీన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత



భద్రాచలంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఇతర అధికారులు

భద్రాచలంఅర్బన్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం స్థానిక బ్రిడ్జి సెంటర్‌లోని ఫారెస్టు చెక్‌పోస్ట్ నుంచి హెల్మెట్లు ధరించి మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 70 మందితో కలిసి చేస్తున్న ర్యాలీని భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ప్రారంభించి వాహనం నడిపారు. బ్రిడ్జి సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదగా చర్ల రోడ్డులో ఉన్న టీజీఆర్‌జేసీ పాఠశాల వరకు ర్యాలీ చేసి, అక్కడి నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదగా కూనవరం రోడ్డులో గల ఆర్టీఏ చెక్‌పోస్టు వరకు వెళ్లారు. తిరిగి అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. మన దేశంలో మరి ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలం పరిసర ప్రాంతాల్లో జరిగే రోడ్డు ప్రమాదాలలో మృతి చెందుతున్నది కేవలం 18–19 ఏళ్లు ఉన్న యువకులని, హెల్మెట్ వినియోగించకపోవడం, ఆసమయంలోనే రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా లేదా మైనర్ల వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో హెల్మెట్‌లకు రెడియం స్టిక్కర్లు వేసి ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మోటార్ వెహికల్ అధికారి వెంకటపుల్లయ్య, టౌన్ సీఐ సంజీవరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి, టౌన్ ఎస్ఐలు మధుప్రసాద్, విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అశ్వారావుపేటరూరల్: జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కావడిగుండ్ల, అనంతారం, వేదాంతపురం, కేశప్పగూడెం, కోయ రంగాపురం, గుర్రాల చెరువు, అశ్వారావుపేటలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా కావడిగుండ్లలో వాలీబాల్ పోటీలు ప్రారంభించి, గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే అనంతారం గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించే కల్వర్టు నిర్మాణానికి, కోయ రంగాపురంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించే వంతెన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా వేదాంతపురం, కేశప్పగూడెం, గుర్రాల చెరువు గ్రామ పంచాయతీల్లో రూ.60లక్షలతో నిర్మించిన నూతన జీపీ భవనాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో అనారోగ్యాలతో బాధపడుతున్న వారిని పరామర్శించి, సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని పేదలకు ఏడాదికి రూ.12వేల నగదు, రైతు భరోసా పథకం కింద రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.12వేలు, అర్హులైన వారికి త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయా పథకాల గురించి పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్‌బాబు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, మిండా హరి, దివాకర్, అల్లాడి రామారావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పినపాక: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వార మంజూరైన చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. సుమారు 21 మందికి రూ.8,15,000 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని, ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తామని తెలిపారు. పేద ప్రజలు వైద్యశాలలో ఖర్చుపెట్టిన డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నగేష్, మండల అధ్యక్షుడు రామనాథం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: కరకగూడెం, మణుగూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ.3.75లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ప్రజాభవన్ కార్యాలయంలో ఈ సందర్భంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కుటుంబాల్లో అనారోగ్య పాలై మెరుగైన వైద్యం చేపించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నవీన్, ముఖ్య నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడి బాబు, గణేశ్‌రెడ్డి, గాదె కేశవరెడ్డి, పెనుగొండ సాంబశివరావు, పాల్గొన్నారు.

చండ్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్‌పార్టీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు మంజూరైన రూ.3 లక్షలు చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, ఫజల్, దారం గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, ఎండి.అన్వర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మోహన్ భగవత్ వ్యాఖ్యలపై నిరసన

అశ్వారావుపేటరూరల్: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు ఆందోళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కోదండ రామారావు మాట్లాడుతూ.. రామ మందిరం నిర్మాణం తర్వాతే దేశానికి స్వాతంత్రం వచ్చిందని వ్యాఖ్యానించడం స్వాతంత్ర సమరయోధులను అవమానించారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన మోహన్ భగవత్‌పై తక్షణమే దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. యూత్ నాయకులు నాగకిషోర్, అల్లాడి రామారావు, తరుణ్, శ్రీను, ప్రవీణ్, గుమ్మాళ్ల గోపి, అశోక్, పండు, మునీర్ పాషా పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహించాలి

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు నెలకు ఒకసారి మెడికల్ టెస్ట్‌లు చేసి వారి వ్యక్తిగత మానసిక ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుల వంశీ తేజ, గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి, గూగులోత్ బాబు డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితులలో కండక్టర్లతో పాటు ఆర్టీసీ డ్రైవర్ల మీద పని ఒత్తిడి ఎక్కువ ఉందని ఆర్టీసీ కార్మికులు ఇప్పటి ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకుని వచ్చారని తెలిపారని, కాబట్టి ఇప్పటికైనా భద్రాచలం డిపో మేనేజర్ డ్రైవర్లకు కండక్టర్లకు కచ్చితంగా ప్రతివారం వారికి ఉండే డ్యూటీలను ముందే పొందుపరిచి వాటికి తగ్గ విధంగా వాళ్లకి విశ్రాంతి సమయాలు కూడా కేటాయించాలని కోరారు. మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు ఆధారంగానే వారికి వచ్చే నెలలో డ్యూటీలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ముమ్మరంగా కొనసాగుతున్న సర్వే

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులను మండల అధికారులు పరిశీలనలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామానుజవరం, కట్టుమల్లారం పంచాయతీల్లో తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు సర్వే నిర్వహించి అభ్యర్థుల వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే నాలుగు పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని బీఆర్ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎటువంటి అపోహలకు తావు ఇవ్వకుండా రాజకీయాలకు అతీతంగా సర్వే చేసి అర్హులైన లబిధదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల,పట్టణ కో కన్వీనర్లు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, నాయకులు వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, టిఆర్ఎస్‌వి నాయకులు తాళ్లపల్లి రాహుల్ గౌడ్, జక్కం రంజిత్, గుర్రం సృజన్, పద్దం శ్రీనివాస్ పాల్గొన్నారు.

దామరచర్లలో వైద్యశిబిరం



చండ్రుగొండ: స్థానికులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామంలో శుక్రవారం ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ శిబిరంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, డాక్టర్ ప్రియాంక, వైద్యసిబ్బంది, ప్రకాష్‌రావు, హారిక, ఆరోగ్యకార్యకర్తలు భవాని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరాలు

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎస్ఆర్ వాసవీ అసోసియేషన్, యూఎస్ఏ సహకారంతో మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నేత్ర శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఇప్పటి వరకు 903 మందికి పుష్పగిరి కంటి ఆస్పత్రి సికింద్రాబాద్ సారథ్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్రశాఖ జనరల్ సెక్రటరీ ఎ.శ్రీరాములు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కళ్లజోళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.రాజారెడ్డి, సూర్యనారాయణ, చారుగుళ్ల శ్రీనివాస్, వైద్యులు వై.భాను ప్రసాద్, కామేశ్వరరావు, నారాయణతో పాటు రొటేరియన్ కె.అబ్రహం, జి.సుధాకర్‌రావు గోళ్ల భూపతిరావు, సీతారామిరెడ్డి, మారుతి కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాలలో ఒక చోట చేరి ఒకరినొకరు పరిచయం చేసుకొని గత జ్ఞాపకాలు, తీపి గుర్తులను నెమరువేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, పాఠశాలలో 20 ఏండ్ల పాటు అటెండర్‌గా పని చేసిన భాస్కర్‌రావును ఘనంగా సన్మానించారు. గురువులు, పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు.

ఫైనల్స్‌కు యూసుఫ్ క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేస్తున్న నిర్వాహకులు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ 17వ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్స్ ఉత్కంఠ భరితంగా సాగాయి. తొలి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సారపాక మణి ఎలెవన్ జట్టు, గుంటుపల్లి ఎలెవన్ జట్టుతో తలపడింది. ఈ మ్యాచ్‌లో 12 ఓవర్లకు 66 పరుగులు చేసి మణి ఎలెవన్ జట్టు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటుపల్లి ఎలెవన్ జట్టు 8.1 ఓవర్లలో 3 వికెట్లు కొల్పోయి 68 పరుగులు చేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. మధ్యాహ్నం జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో కొత్తగూడెం ఫరీద్ ఎలెవన్ జట్టు 11.3 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు 11.5 ఓవర్లకు 83 పరుగులకు ఆలౌట్ అయ్యి ఓటమి పాలైంది. సెమీస్‌లో ప్రతిభ కనబరిచిన సాగర్, పండులకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను నిర్వహకులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.

25 నుంచి మహాసభలు

బూర్గంపాడు: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం సారపాకలో జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరగనున్న పార్టీ మహాసభలకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బయ్యా రాము, పాండవుల రామనాథం, ఎస్‌కె.అబీదా, లక్ష్మి, మేడి ప్రభాకర్, గడదేశీ నాగేశ్వరరావు, కణితి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు (శనివారం) స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించనున్నారని, గండుగులపల్లి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు.

లంక భూముల్లో సర్వే

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామంలోని లంక భూములలో శుక్రవారం మండల అధికారులు రైతు భరోసా ఫీల్డ్ వెరిఫికేషన్‌లో భాగంగా సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా అధికారులు గోదావరి నదీలో పడవ మీద గోదావరి దాటి లంక భూములను పరిశీలించి సర్వే నం.3లో గల 37 ఎకరాలు భూమి వ్యవసాయ యోగ్యము కావని, రాళ్ల గుట్టలతో నిండిఉందని సర్వేలో నిర్ధారించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, యూడీసీ నర్సింహారావు, ఏఈఓ బాలాజీ, ప్రైవేట్ సర్వేయర్ వెంకట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పక్కాగా చేయాలి

ములకలపల్లి: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వే పక్కాగా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సమగ్ర వివరాలు సేకరించాలని అన్నారు. ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా, నిమ్మల మధు పాల్గొన్నారు.